క్లుప్తంగా

పార్ట్ టైం ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



అచ్చంపేట రూరల్: ఎస్సీ గురుకుల పార్ట్ టైం ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఎంఎస్ఎఫ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మహేష్ డిమాండ్ చేశారు. గురువారం అచ్చంపేటలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఎంఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. అనంతరం కార్యాలయంలోని సిబ్బందికి వినతిపత్రం అందజేశారు.కార్యక్రమంలో నాయకులు ఆంజనేయులు,రాజు, శ్రీనాథ్, అంజి,కృష్ణ పాల్గొన్నారు.

ప్రసవాల సంఖ్య పెంచాలి



బిజినేపల్లి: గర్భిణులకు మాతృత్వ సంరక్షణ సేవలు అందించడంతో పాటు వారికి ప్రభుత్వ ఆస్పత్రిలోనే సాధారణ ప్రసవాలు అయ్యేలా చూడాలని, అందుకు ప్రత్యేక లక్ష్యాలు ఏర్పాటు చేసుకోవాలని లట్టుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి డా. ప్రసన్న అన్నారు. గురువారం లట్టుపల్లి పీహెచ్‌సీలో ఆరోగ్య సిబ్బందికి ప్రధానమంత్రి సురక్షిత్ మాతృత్వ అభియాన్ పథకం ద్వారా గర్భిణులకు అందుతున్న సేవలు, ప్రసవాలు వంటి వాటిపై సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో డా.మేఘనారెడ్డి, ఆరోగ్య సిబ్బంది చంద్రశేఖర్, శ్రీనివాసులు, దివ్య, బాలమణి, స్వరూప, సుమిత్ర, బొజ్జమ్మ, వరలక్ష్మి, అబ్దుల్ సలీం పాల్గొన్నారు.

స్పోర్ట్స్ పాఠశాలకు విద్యార్థుల ఎంపిక



కందనూలు: తెలంగాణ హకీంపేట్ స్పోర్ట్స్ పాఠశాలకు జిల్లా కేంద్రంలోని ధ్యాన్‌చంద్ అథ్లెటిక్స్ అకాడమీ సెంటర్ నుంచి ఓంకార్, మనోజ్‌కుమార్, జ్ఞానేశ్వర్ ఎంపికైనట్లు నిర్వాహకులు రాణామల్లేష్ గురువారం తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను డీఎస్పీ శ్రీనివాసులు శాలువాతో సత్కరించి అభినందించారు.

కంటి ఆరోగ్యంపై జాగ్రత్త అవసరం



కందనూలు: కంటి ఆరోగ్యంపై జాగ్రత్త అవసరం అని జిల్లా డిప్యూటీ వైద్యాధికారి వెంకటదాస్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఇన్‌చార్జి హెచ్‌ఎం బాలరాజు అధ్యక్షతన ప్రపంచ దృష్టి దినోత్సవం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన వెంకటదాస్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం అక్టోబర్ రెండో గురువారం దృష్టి దినోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరు నేత్రదాన అవసరాన్ని తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

తైక్వాండో పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

కొల్లాపూర్: గద్వాల జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ఐ తైక్వాండో పోటీల్లో కొల్లాపూర్‌కు చెందిన విద్యార్థులు ప్రతిభ చాటారు. అండర్‌-14లో 23 కేజీల విభాగంలో పాండు గోల్డ్ మెడల్ సాధించారు. 38 కేజీల విభాగంలో గౌతమ్ సిల్వర్ మెడల్ సాధించినట్లు తైక్వాండో కింగ్స్‌క్లబ్ కోచ్ భాస్కర్‌యాదవ్ తెలిపారు. గోల్డ్‌మెడల్ సాధించిన పాండు శుక్రవారం నుంచి నిజామాబాద్ జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని ఆయన తెలిపారు.

పీజీ అధ్యాపకుల నిరసన

కొల్లాపూర్: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్‌పై దాడిని ఖండిస్తూ కొల్లాపూర్‌లోని ప్రభుత్వ పీజీ కళాశాల అధ్యాపకులు గురువారం కళాశాల ప్రధాన ద్వారం ముందు నిరసన తెలిపారు. సుప్రీంకోర్టు జడ్జిపై న్యాయస్థానంలోనే దాడికి ప్రయత్నించిన వ్యక్తిని చట్టపరంగా కఠినంగా శిక్షించాలని కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మార్క్‌పోలోనియస్, అధ్యాపకులు, సిబ్బంది ఉన్నారు.

రాగి జావా పంపిణీ

కొల్లాపూర్: కొల్లాపూర్, పెంట్లవెల్లి మండలాల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉదయం పూట విద్యార్థులకు వడ్డించేందుకు అవసరమైన రాగి జావాను పాఠశాలల హెచ్‌ఎంలకు గురువారం ఎంఈఓ ఇమ్మానుయేల్ అందజేశారు. ప్రోటీన్స్‌తో కూడిన రాగిజావాను పేద విద్యార్థులకు అందించాలని ఆయన సూచించారు. అంతకుముందు ఆయన ఆర్‌ఐడీ పాఠశాలలో విద్యార్థులకు యూనిఫామ్స్ పంపిణీ చేశారు.

సమస్యలు పరిష్కరించాలి

- కలెక్టర్ బాదావత్ సంతోష్

వెల్దండ: వెల్దండ తహసీల్దార్ కార్యాలయాన్ని కలెక్టర్ బాదావత్ సంతోష్ గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గతంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో వచ్చిన దరఖాస్తులను పరిష్కరించాలని సూచించారు. మండలంలో16 రెవెన్యూ గ్రామాలు ఉండగా 363 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. ఇప్పటి వరకు 110 దరఖాస్తులను పరిష్కరించినట్లు పేర్కొన్నారు. మిగిలిన 253 దరఖాస్తులు వివిధ దశల్లో విచారణ సాగుతున్నట్లు కలెక్టర్‌కు వివరించారు. వేగవంతంగా దరఖాస్తులను పూర్తి చేయాలని కలెక్టర్ సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కార్తీక్‌కుమార్, డిప్యూటీ తహసీల్దార్ కిరణ్‌కుమార్, నసీరుద్దీన్, తదితరులు ఉన్నారు.



వెల్దండ తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ సంతోష్

మోడల్ హౌస్ నిర్మాణం పూర్తి



పెద్దకొత్తపల్లి: మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఇందిరమ్మ ఇళ్ల మోడల్ హౌజ్ నిర్మాణం పూర్తైనట్లు ఎంపీడీఓ నాగేందర్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.5 లక్షలతో చేపట్టే మోడల్ హౌజ్‌ను ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో రూ.లక్షతో బెస్‌మెంట్, రూ.2 లక్షలతో లెంటల్ లెవల్, మరో రూ.లక్షతో స్లాబ్ వరకు, రూ.2 లక్షలతో ఇంటిలోని బండలు, మరుగుదొడ్ల వంటి పనులను పూర్తి చేయించినట్లు ఆయన పేర్కొన్నారు. లబ్ధిదారులు ఇందిరమ్మ ఇళ్లను ఈ మాడల్‌లో నిర్మించుకుంటే అప్పుల పాలు కాకుండా ఉంటారని ఆయన పేర్కొన్నారు.

కాన్షీరాం ఆశయాలు సాధిస్తాం



కొల్లాపూర్: కాన్షీరాం వర్ధంతి సందర్భంగా గురువారం కొల్లాపూర్‌లోని అంబేడ్కర్ చౌరస్తాలో బీఎస్పీ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాన్షీరాం ఆశయ సాధన కోసం కృషి చేస్తామన్నారు. బహుజనులకు రాజ్యాధికారం రావడమే బీఎస్పీ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడు బొల్లి కురుమయ్య, నాయకులు సుధాకర్, నాగేషు, రామకృష్ణ, పారిజాత, దానయ్య, ఆనంద్, కురుమయ్య, మేఘరాజ్, శరత్, నరేష్ తదితరులు ఉన్నారు.

హాస్టళ్లలో వసతులు కల్పించాలి




కందనూలు: ప్రభుత్వ హాస్టళ్లలో విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించాలని ఎస్ఎఫ్ఐ నాయకుడు తారాసింగ్ డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని హాస్టళ్లను సందర్శించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థులకు కాస్మోటిక్ చార్జీలను విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలపై పోరాటం

వెల్దండ: ఉపాధ్యాయుల సమస్యలపై నిరంతరం టీఆర్‌టీఎఫ్ యూనియన్ పోరాటం చేస్తుందని జిల్లా ప్రధాన కార్యదర్శి మునగాల సతీష్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని బొల్లంపల్లి జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్(టీఆర్‌టీఎఫ్) ఆధ్వర్యంలో మండల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ మండల అధ్యక్షుడు రాజేందర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. అనంతరం నూతన కమిటీని సన్మానించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు రమేష్, పోచయ్య, మంగులాల్, మహేందర్, షీలా, ఉపాధ్యాయులు ఉన్నారు.

గుండెపోటుతో ఉపాధ్యాయుడు మృతి



కోడేరు: కోడేరు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న మిద్దె కేశవులు (37) గుండెపోటుతో గురువారం మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. 15రోజుల క్రితం అనారోగ్యానికి గురై మిద్దె కేశవులు ఆస్పత్రిలో చేరి గుండె ఆపరేషన్ చేయించుకున్నారు. తోటి ఉపాధ్యాయులు వైద్య ఖర్చులకు ఆర్థికసాయం చేసి ఆదుకున్నారు. బుధవారం రాత్రి ఆస్పత్రి నుంచి స్వగ్రామమైన దేవుని తిర్మలాపురం వచ్చారు. గురువారం ఉదయం వాంతులు చేసుకోవడంతో అంబులెన్స్‌కు ఫోన్ చేసే లోపే మృతి చెందాడు. ఆయనకు భార్య సరిత, ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు.

బాకీ కార్డులను విడుదల చేసిన మాజీ ఎమ్మెల్యే



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి

తిమ్మాజిపేట: కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చనందున ప్రజలకు బాకీ పడ్డ హామీలను వెంటనే అమలు చేయాలని మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి డిమాండ్ చేశారు. మండలంలోని నేరళ్లపల్లిలో ఇంటి ఆవరణలో గురువారం బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ బాకీ కార్డులను ఆయన కార్యకర్తల సమక్షంలో విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి ఆరు గ్యారంటీలు, 420 హామీలు ఇచ్చి 22 నెలలు గడుస్తున్నా ఏ ఒక్కటి అమలు చేయలేదన్నారు. రైతులకు, మహిళలకు, వృద్ధులకు, నిరుద్యోగ యువతకు, విద్యార్థులకు బాకీపడిన పథకాలను తెలియజేయడానికి బాకీ కార్డుల పేరు మీద ప్రజలలో చైతన్యం తెస్తామన్నారు. సాయంత్రం కోర్టు స్టే రావడంతో అభ్యర్థుల ఎంపికను వాయిదా వేశారు. సమావేశంలో మండలాధ్యక్షుడు జోగు ప్రదీప్, మాజీ ఎంపీపీ రవీంద్రనాథ్‌రెడ్డి, గోపిగౌడ్, శ్రీనుయాదవ్, మోహనాచారి, కిల్లె మల్లయ్య, చెన్నయ్య, ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్మికులకు పెండింగ్ ఏరియర్స్ చెల్లించాలి

నాగర్‌కర్నూల్ రూరల్: మున్సిపాలిటీలో పనిచేస్తున్న కార్మికులకు పెండింగ్‌లో ఉన్న ఏరియర్స్‌ను వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఆర్.శ్రీనివాసులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం నాగర్‌కర్నూల్ మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ నాగిరెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్సిపల్ కార్మికులు పెండింగ్ ఏరియర్స్ కోసం ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం సరికాదన్నారు. ఇప్పటికైనా కార్మికులకు చెల్లించాల్సిన ఏరియర్స్ ఇవ్వడంతో పాటు సేఫ్టీ పరికరాలు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్మికులు బాలరాజు, వెంకటేశ్, భీముడు, రాములు, బాలస్వామి, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

పొంగిపొర్లిన వాగులు

బల్మూర్: భారీ వర్షాల తాకిడికి చెరువులు, కుంటలు నిండి పొంగిపొర్లుతున్నాయి. చేతి కొచ్చిన పత్తి పంటలు తడిసి ముద్దయి రైతులకు ఆపార నష్టం కలిగిస్తున్నాయి. మండలంలో గురువారం అర్ధరాత్రి మరోసారి వర్షం కురవడంతో 5.80 మి.మీ. వర్షపాతం నమోదైంది. బల్మూర్, మైలారం, అనంతవరం, అంబగిరి, గోదల్, వీరంరాజుపల్లి శివార్లలో చెరువులు, కుంటలు మరోసారి నిండి అలుగులు పొంగిపొర్లాయి. బల్మూర్‌-అచ్చంపేట ప్రధాన రహదారిలోని రోడ్డు చెరువు అలుగు పారడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడ్డాయి. చేతి కొచ్చిన పత్తి పంట చెట్లపైనే తడిసి నల్లబారి పోయాయి. దీంతో రైతులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు.



బల్మూర్‌-అచ్చంపేట ప్రధాన రహదారిపై అలుగు పారుతున్న వరద నీరు

చే గువేరా నేటి యువతకు స్ఫూర్తి

నాగర్ కర్నూల్ రూరల్: సమాజంలో చే గువేరా జీవితం యువతకు స్ఫూర్తి అని డీవైఎఫ్ఐ మాజీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఆర్ శ్రీనివాస్ అన్నారు. గురువారం డీవైఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద చే గువేరా 58వ వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎం శ్రీనివాసులు, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నాగపూర్ మధు మాజీ ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రమౌళి, నాయకులు సుల్తాన్, వెంకటేష్, కృష్ణ, రామచంద్రయ్య, నాగరాజ్, మస్తాన్ పాల్గొన్నారు.

కందనూలు: ప్రపంచ విప్లవయోధుడు కమ్యూనిస్టు పార్టీ నాయకుడు కామ్రేడ్ చే గువేరా జీవితాన్ని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని సీపీఐ నాగర్ కర్నూల్ జిల్లా కార్యదర్శి ఎస్ఎండీ ఫయాజ్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో చే గువేరా వర్ధంతి నిర్వహించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మారేడు శివశంకర్, సీపీఐ జిల్లా సమితి సభ్యులు తుమ్మల శివుడు, గోపి, చారి, పాల్గొన్నారు.



చే గువేరా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

చెరుకు పంటకు మద్దతు ధర ప్రకటించాలి

అమరచింత: టన్ను చెరుకుకు కేంద్ర ప్రభుత్వం రూ.6 వేలు మద్దతు ధర ప్రకటించాలని కృష్ణవేణి చెరుకు రైతు సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు రాజన్న డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో గురువారం మండల చెరుకు రైతులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పత్తికి మద్దతు ధర క్వింటాలుకు రూ.8150 ఇస్తున్నదని, పత్తికి ఇస్తున్న మద్దతు ధర ప్రకారం చెరుకు పంటకు సైతం ఇవ్వాలన్నారు. కృష్ణవేణి షుగర్ ఫ్యాక్టరీ యాజమాన్యం రైతుల నుంచి చెరుకును ఫ్యాక్టరీకి తరలించిన 14 రోజుల్లో రైతుల ఖాతాలో డబ్బులు జమ చేయాలన్నారు. ఈనెల 11న ఆత్మకూర్‌లోని మార్కెట్ యార్డులో ఆత్మకూర్ జోన్ చెరుకు రైతుల సమావేశం నిర్వహిస్తున్నామని, కార్యక్రమానికి అమరచింత, ఆత్మకూర్ మండలాల చెరుకు రైతులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. సమావేశంలో ఉమ్మడి జిల్లా కార్యదర్శి జి.రవి, యువరాజు, డేవిడ్, విజయ్, శేఖర్, శ్రీకాంత్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాజన్న

భక్తిశ్రద్ధలతో సత్యసాయి విగ్రహ ప్రతిష్ఠ

కల్వకుర్తి రూరల్: పట్టణంలోని ప్రశాంతి సన్నిధి ఆవరణలో గురువారం భక్తిశ్రద్ధలతో సత్యసాయి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. మూడు రోజుల పాటు ఉత్సవాలు జరగనున్నాయి. ఆలయ ప్రాంగణంలో షిరిడి సాయి, సత్య సాయి విగ్రహాలతో పాటు మహాలక్ష్మి గణపతి, గాయత్రి మాత, అన్నపూర్ణ మాత, దశావతార మూర్తుల విగ్రహాలను ప్రతిష్ఠించనున్నారు. జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి ఉత్సవాలకు హాజరై హోమం లో పూజలు చేశారు. బీజేపీ నాయకులను సత్యసాయి ట్రస్ట్ అధ్యక్షుడు గుబ్బ ఈశ్వరయ్య, గుబ్బ వెంకటేష్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు.



హోమంలో పాల్గొన్న ఆచారి

ఎన్నికలు ఎప్పుడు వచ్చినా సిద్ధంగా ఉండాలి

వెల్దండ: స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు వచ్చినా పార్టీ కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ పేర్కొన్నారు. గురువారం వెల్దండలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలను మోసం చేసేందుకు కుట్ర పూరితంగా రిజర్వేషన్ ప్రకటించి కోర్టులో అడ్డుకోవడం జరిగిందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికలపై అవగాహన లేకుండా రిజర్వేషన్లు ప్రకటించారన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో జరిగిన అభివృద్ధిని ప్రజలు గమనిస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల్లో ఎప్పుడు వచ్చినా పార్టీ అభ్యర్థులు సిద్ధంగా ఉండి బీఆర్ఎస్ జెండాను ఎగరవేయాలని పిలుపునిచ్చారు. అజిలాపూర్ ఎంపీటీసీ అభ్యర్థిని ప్రకటించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పుట్టరాంరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ హైజాక్, నాయకులు కర్ణాకర్‌రెడ్డి, రమేష్‌గౌడు, రవి, వెంకటేష్, ప్రభాకర్, సోమయ్య, శ్రీనివాసులు, కృష్ణయ్య ఉన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

పోషకాహారంపై విద్యార్థులకు అవగాహన

ఉప్పునుంతల: స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో గురువారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణమాసంలో భాగంగా విద్యార్థినులకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. పోషక విలువలు గల ఆహారాన్ని తీసుకుంటే ఆరోగ్యవంతగా జీవించగల్గుతామని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బీపాషా సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పాలు, గుడ్లు, ఆకుకూరలు, సీజన్ వారిగా లభించే పండ్లు తినాలని చెప్పారు. ఈ సందర్భంగా పోషకాహారంపై విద్యార్థులను వ్యాసర రచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కేజీబీవీ ప్రిన్సిపాల్ సైదా, అంగన్‌వాడీ టీచర్లు సరస్వతి, భార్గవి, కేజీబీవీ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



పోషకాహారంపై విద్యార్థునులకు అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బీపాషా

ముగ్గురు అదృశ్యం

కల్వకుర్తి రూరల్: మండలంలోని రఘుపతిపేట గ్రామానికి చెందిన గుండూరు లక్ష్మమ్మ (50) కనబడుటలేదని భర్త మల్లయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ మాధవరెడ్డి తెలిపారు. 5న తమ సొంత గ్రామం నుంచి హైదరాబాద్ వెళ్లేందుకు ఆటోలో వచ్చిందని, ఆరోజు నుంచి ఆమె ఆచూకీ లభించలేదని ఎస్ఐ తెలిపారు. గురువారం భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎవరికైనా ఆచూకీ తెలిస్తే 8712657752 నెంబర్‌కు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ మాధవరెడ్డి కోరారు.

కమ్మారెడ్డిపల్లిలో..



తెల్కపల్లి: మండల పరిధిలోని కమ్మారెడ్డిపల్లిలో మహిళ అదృశ్యం కావడంతో కేసు నమోదైనట్లు ఎస్ఐ నరేష్ తెలిపారు. ఎస్ఐ వివరాల ప్రకారం.. మండల పరిధిలోని కమ్మారెడ్డిపల్లి గ్రామానికి చెందిన భవనపల్లి సువర్ణ(40) భర్త ఆంజనేయులుతో ఈనెల 7న రాత్రి గొడవ పడింది. మరుసటి రోజు 8న కూలి పనులకు వెళ్తునని చెప్పి గ్రామంలోకి వచ్చింది. తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆమె కోసం ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో గురువారం ఆమె కొడుకు చందు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అతని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కల్వకుర్తిలో యువకుడు..

కల్వకుర్తి టౌన్: ఇంటి నుంచి బయటకు వెళ్లిన కుమారుడు ఇంటికి తిరిగి రాకపోవటంతో కేసు నమోదు చేసినట్లుగా ఎస్ఐ మాధవరెడ్డి తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం .. పట్టణంలో నివాసముండే శివకుమార్ ఈ నెల 6వ తేదీ సోమవారం మధ్యాహ్నం ఇంట్లో భోజనం చేసి బయటకు వెళ్లాడు. రోజు గడిచిన కుమారుడు ఇంటికి రాకపోవటంతో కుటుంబసభ్యులు పలుచోట్ల ఆరా తీసిన ఆచూకీ లభించలేదు. గురువారం రోజున తండ్రి ఆంజనేయులు ఫిర్యాదుతో యువకుడి మిస్సింగ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

బీజేపీలో చేరిన గిరిజనులు

కల్వకుర్తి రూరల్: మండలంలోని తర్నికల్ తండాకు చెందిన 50 మంది గిరిజనులు గురువారం జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి సమక్షంలో బీజేపీలో చేరారు. పార్టీ కార్యాలయంలో గిరిజనులకు ఆచారి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై ప్రజలకు వివరించి ఓట్లు అడుగుతామన్నారు. ఆరు గ్యారంటీలతో ప్రజలను చేసిన వంచనను వివరించి ప్రజలను చైతన్యం చేస్తామని, ప్రతి కార్యకర్త ప్రజలలో ఉండి వారి సమస్యలపై ఉద్యమించాలని ఆచారి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు బండెల రామచంద్రారెడ్డి, దుర్గాప్రసాద్, కిష్టారెడ్డి, బోడ నరసింహ, రాంభూపాల్ రెడ్డి, సురేందర్‌గౌడ్, కిరణ్‌రెడ్డి, శ్యామ్, శ్రీశైలం, గిరిజనులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలి

చారకొండ: మండలంలోని ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో బీజేపీ నాయకులు సత్తా చాటాలని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు దుర్గాప్రసాద్ తెలిపారు. మండల కేంద్రంలో గురువారం ఫంక్షన్ హాల్లో బీజేపీ నాయకులు సమావేశం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు పైదులు, మహిళా మోర్చా అధ్యక్షురాలు జానకి, మండల అధ్యక్షుడు చెలమోని కృష్ణ, నాయకులు ఉన్నారు.

బీజేపీ గెలుపు తథ్యం

ఉప్పునుంతల: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ విజయం సాధిస్తుందని బీజేపీ సీనియర్ నాయకులు మండికారి బాలాజీ అన్నారు. గురువా రం ఉప్పునుంతల మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు తోట్ల మహేష్ యాదవ్ ఆధ్వర్యంలో స్థానిక సంస్థల ఎన్నికలపై మండల స్థాయి నాయకులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో మండల నాయకులు మొగిలి చంద్రు పాల్గొన్నారు.

దాడి చేసిన వారిపై కేసు నమోదు చేయాలి

పెద్దకొత్తపల్లి: పెద్దకారుపాముల గ్రామంలో దళితులకు కేటాయించిన భూమిలో వ్యవసాయ పనులు చేసుకుంటుండగా గ్రామానికి చెందిన బీసీలు దళితులైన సిద్ధార్థ, మహేష్‌లపై మరో ఇద్దరిపై మారణాయుధాలతో దాడులు చేసి గాయపర్చారు. ఈ సంఘటనపై పెద్దకొత్తపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి దళితులకు న్యాయం చేయాలని బెడ బుడగ జంగాల రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణయ్య, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు పరుశరాముడు కోరారు. గురువారం అంబేడ్కర్ చౌరస్తాలో నిరసన తెలిపారు. కార్యక్రమంలో బుడగ జంగాల మండల అధ్యక్షుడు సుభాష్, మహేష్, కుమార్, బాలమశయ్య పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని పరామర్శించిన దళిత నేతలు

తాడూర్: దళిత ఉద్యమ నాయకుడు బీఆర్ఎస్ మండల నాయకులు పరిగెల బాలవెంకటయ్య తండ్రి పరిగెల బాలపీరు మరణించడంతో ఆయన కుటుంబ సభ్యులను రాష్ట్ర దళిత నాయకులు పరామర్శించారు. మండలంలోని ఆకునెల్లికుదురు వెళ్లి ఆయన పార్థీవ దేహానికి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ జాతీయ అధ్యక్షుడు జెట్టి ధర్మరాజు, ఎంపీటీసీల సంఘం నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు మంగి విజయ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. దళిత జాతిలో ఓ ముందుతరం వ్యక్తి మరణించడం బాధకరమన్నారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చి ధైర్యం చెప్పారు. కొత్తపల్లి వెంకటయ్య, కొత్తపల్లి కుమార్, జోగు ప్రదీప్, దశరథం, విల్సన్, గోపికృష్ణ, వెంకటేష్, కాశరాజు, సత్తి, అర్జున్, పరుశరాం పరామర్శించిన వారిలో ఉన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు

కొడేరు: మండలంలోని జనుంపల్లి గ్రామానికి చెందిన బీజేపీ మండల కార్యదర్శి శివకుమార్ నాయుడు బీజేపీని వీడి మాజీ ఎంపీపీ కొత్త రామ్ మోహన్‌రావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరినట్లు తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

జిల్లాకు చేరిన ఎన్నికల పరిశీలకులు



నాగర్‌కర్నూల్: స్థానిక ఎన్నికల నేపథ్యంలో నాగర్ కర్నూల్ జిల్లాకు సాధారణ పరిశీలకులు శ్రీవత్స ఐఏఎస్ గురువారం జిల్లాకు చేరుకున్నారు. వారికి స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్‌లో కలెక్టర్ బాదావత్ సంతోష్ అదనపు కలెక్టర్ దేవ సహాయం పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. వారు ఇరువురితో జిల్లాలో స్థానిక సంస్థల్లో పోటీ చేసే అభ్యర్థుల, ఎన్నికల విధానాన్ని తెలుసుకోనున్నారు. జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికలపై తీసుకున్న చర్యలపై ఆయన ఆరా తీశారు. జిల్లా పంచాయతీ అధికారి శ్రీరాములు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

దాఖలు కాని నామినేషన్లు

నాగర్ కర్నూల్ రూరల్: మండలంలోని 14 ఎంపీటీసీ స్థానాలకు గురువారం సాయంత్రం వరకు ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదు.

వెల్దండ: వెల్దండలోని స్థానిక సంస్థల నామినేషన్ల ప్రక్రియను కలెక్టర్ బాదావత్ సంతోష్ పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీఓ సత్యపాల్‌రెడ్డి, తహసీల్దార్ కార్తీక్‌కుమార్, ఎస్ఐ కురుమూర్తి, సిబ్బంది లక్ష్మణ్, రేవత్‌రెడ్డి, కార్యదర్శులు పాల్గొన్నారు.

తిమ్మాజిపేట: తిమ్మాజిపేట మండలంలో ఒక్క నామినేషన్ కూడా రాలేదని ఎంపీడీఓ లక్ష్మీదేవి తెలిపారు.

చారకొండ: మొదటి రోజు చారకొండ జెడ్పీటీసీ స్థానానికి అగ్రహారం తండాకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు నేనావత్ చందులాల్ నాయక్ జెడ్పీటీసీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు.

కల్వకుర్తి రూరల్: మండలంలోని ఎల్లికల్ ఎంపీటీసీ స్థానానికి స్వతంత్ర అభ్యర్థి పబ్బతి రాములు నామినేషన్ వేశారు.

తెల్కపల్లి: కోర్టు స్టే విధించడంతో ఎన్నికలు వాయిదా పడే అవకాశం ఉందని ఎంపీడీఓ శ్రీనివాసులు తెలిపారు.